నేత్రపర్వంగా పుష్పయాగం



నెల్లూరు సిటీ: నరసింహకొండలో వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పుష్పయాగాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈఓ గోపీ, ఉత్సవ కమిటీ చైర్మన్ అచ్యుత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో రామానందభారతి

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామిని విశాఖపట్నంలోని సౌభాగ్య భువనేశ్వరి పీఠానికి చెందిన రామానందభారతి శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి పూర్ణకుంభంతో ఈఓ గోపీ, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.



రాజరాజేశ్వరి ఆలయంలో పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో రాహుకాల పూజలను శుక్రవారం నిర్వహించారు. వేదపారాయణం, సంధ్యామేళం, కుంభహారతులు, పల్లకిసేవను విశేషంగా జరిపారు. విశేషాలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,000 విరాళాన్ని ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డికి ఓ భక్తుడు అందజేశారు.

హనుమాన్‌చాలీసా అఖండ పారాయణం

నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో ఈ నెల 22న నిర్వహించనున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా 72 గంటలు నిరివ్రామంగా సాగించే హనుమాన్ చాలీసా అఖండ పారాయణాన్ని శుక్రవారం ప్రారంభించారు. విజయవాడకు చెందిన అఖిల భారత హనుమద్దీక్ష పీఠానికి చెందిన భక్తబృంద ఆధ్వర్యంలో అఖండ పారాయణాన్ని చేపట్టారు. అంకురార్పణను సోమవారం సాయంత్రం నిర్వహించనున్నారు.



క్లుప్తంగా

చెస్ టోర్నీ రేపు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆలిండియా ఓపెన్ చెస్ టోర్నీని గొలగమూడిలోని ఫన్ పార్క్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం నిర్వహించనున్నామని చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్, ఫన్‌పార్క్ ఎండీ పాత్తూరి సాయి తెలిపారు. టోర్నీకి సంబంధించిన ఆహ్వాన పత్రికలు, పోస్టర్లను ఫన్‌పార్క్ ఫంక్షన్ హాల్లో టోర్నీ నిర్వహణ కార్యదర్శి, ఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ కోచ్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విజేతలకు రూ.లక్షతో పాటు వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన జూనియర్లకు ప్రోత్సాహక బహుమతులను అందజేయనున్నామని వివరించారు. వివరాలకు 62815 80209 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ తీగలకు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఇస్కాన్ సిటీ ఐదో వీధిలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతుండటంతో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ప్రమాదభరితంగా విద్యుత్ తీగలు అనే శీర్షికన సాక్షిలో కథనం గురువారం ప్రచురితమైంది. ఈ తరుణంలో అధికారులు స్పందించారు. స్తంభాన్ని ఏర్పాటు చేసి వేలాడుతున్న తీగలను సరిచేశారు.


కాల్షియం కార్బైడ్‌ను వినియోగిస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న వెంకటేశ్వరరావు

నెల్లూరు(అర్బన్): మామిడి పండ్లను కృత్రిమంగా మగ్గించేందుకు కాల్షియం కార్బైడ్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు తెలిపారు. నగరంలోని పలు మామిడి పండ్ల దుకాణాలను సిబ్బందితో కలిసి శుక్రవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే కొన్ని మామిడి పండ్లను శాంపిళ్లగా తీసుకొని ల్యాబ్‌కు పంపామని, అయితే ఎక్కడా కాల్షియం కార్బైడ్‌ను వినియోగించిన ఆనవాళ్లు లేవన్నారు. పండ్లను కృత్రిమంగా మగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వ ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ సూచనల మేరకు ఎథిలీన్‌ను వినియోగించొచ్చని చెప్పారు. ఎథిలీన్ చాంబర్స్‌ను హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ సహకారంతో 35 శాతం సబ్సిడీపై పొందవచ్చని పేర్కొన్నారు. మామిడి పండ్ల పెట్టెల్లో ఎథిలిన్ రైపనర్లు కలిగిన ప్యాకెట్లను చూసిన కొందరు వాటిని కాల్షియం కార్బైడ్‌గా భావిస్తున్నారని వివరించారు.

డెంగీ నివారణకు కృషి



ర్యాలీని ప్రారంభిస్తున్న సుజాత

నెల్లూరు(అర్బన్): డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయం నుంచి గుప్తా పార్కు తదితర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీని వైద్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరంగా మారుతుందని చెప్పారు. అనంతరం వ్యాధి నివారణకు కృషి చేస్తామంటూ వైద్యశాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, సహాయాధికారి నాగార్జునరావు, డెమో అధికారి కనకరత్నం, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, కార్యదర్శి గోరంట్ల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బ్లాస్టింగ్‌లను నిలువరించరూ..



ఎస్పీకి వినతిపత్రమిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, రామ్‌కుమార్‌రెడ్డి తదితరులు

నెల్లూరు(క్రైమ్): అక్రమ మైనింగ్‌పై చర్యలు చేపట్టడంతో పాటు జిల్లాలోని మైన్లలో అడ్డూఅదుపు లేకుండా సాగుతున్న అక్రమ బ్లాస్టింగ్‌లను నిలువరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జి, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. జిల్లాలోని మైన్లలో పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారని చెప్పారు. సైదాపురం మండలంలో అక్రమ మైనింగ్ సాగుతోందని, బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో శాంతిభద్రతలు క్షీణించాయని, ఆర్నెల్ల వ్యవధిలో 20 హత్యలు జరగడమే దీనికి నిదర్శనమని చెప్పారు. రౌడీలు, అసాంఘిక శక్తులు ఇసుక రీచ్‌లు, మైనింగ్ జరిగే ప్రాంతాల వద్ద ఉంటూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రౌడీలు, అసాంఘిక శక్తులను పెంచి పోషిస్తున్న రాజకీయ నేతలపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజా హుస్సేనీ, రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల, మైనార్టీ, యువజన, విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షులు సిద్ధిఖ్, ఊటుకూరు నాగార్జున, అశ్రిత్‌రెడ్డి, కార్పొరేటర్ వేలూరు మహేష్, మహేష్‌యాదవ్, అబ్దుల్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే వ్యవసాయ సర్వీసుల మంజూరు



మాట్లాడుతున్న సంతోషరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ సర్వీసులను వెంటనే మంజూరు చేయాలని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు, డైరెక్టర్ గురవయ్య ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో జిల్లా అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తకూడదని చెప్పారు. సిబ్బంది వారికి కేటాయించిన హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రానున్న రెండు నెలల్లో జిల్లాకు మరోసారి వస్తానని, నిర్దేశించిన అంశాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం విద్యుత్ భవన్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎస్‌ఈ విజయన్, నోడల్ అధికారి శేషాద్రిబాలచంద్ర, ఈఈలు సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, రమేష్‌చౌదరి, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, పరంధామయ్య, బెనర్జీ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి జయంత్యుత్సవం రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేట అరుణాచలంవీధిలోని ఎస్వీఎస్ కల్యాణ మండపంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంత్యుత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖరావు, చీఫ్ ఆర్గనైజర్ కోట గురుబ్రహ్మం తెలిపారు. స్టోన్‌హౌస్‌పేటలోని నెల్లూరు డిస్ట్రిక్ట్ రైస్ కాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. నేతలు మెంటా వీరబ్రహ్మంగుప్తా, భవనాశి సురేష్‌బాబు, దరిశి హరికృష్ణ, ఆంజనేయులు, తోట సత్యనారాయణ, సోమిశెట్టి వెంకటరమేష్, జొన్నలగడ్డ మోహన్‌రావు, దగ్గుపాటి మురళి తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తీయకపోతే చర్యలు



పూడికతీత పనులను పరిశీలిస్తున్న చైతన్య

నెల్లూరు(బారకాసు): కాలువల్లో పూడికతీత పనులను చేపట్టకపోతే చర్యలు తప్పవని ఎంహెచ్‌ఓ చైతన్య పేర్కొన్నారు. నగరంలోని 16వ డివిజన్లో చేపట్టిన పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. చెత్త వాహనం రోజూ వస్తోందాననే అంశమై స్థానికులను ఆరాతీశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. 16 / 2లోని ఐదు ఖాళీ స్థలాల్లో జంగిల్ క్లియరెన్స్‌ను యజమాలతో చేయించాలని ఆదేశించారు.

బాధితులకు ఐటీడీఏ చేయూత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): చేజర్ల మండలం ఆదూరుపల్లి గిరిజన కాలనీలో గురువారం సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు ఐటీడీఏ అధికారులు చేయూతనందించారు. ఘటన స్థలానికి ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ పరిపాలనాధికారి కృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసులు శుక్రవారం చేరుకొని నిత్యావసర సరుకులు, రూ.ఐదు వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడారు. చేవూరి సుబ్రహ్మణ్యం, చేవూరి చెంచయ్య, తుపాకుల సుబ్బరత్నమ్మ నివాసాల్లో జరిగిన అగ్ని ప్రమాదాన్ని వివరిస్తూ సాక్షిలో వార్త ప్రచురితమైందని, ఐటీడీఏ పీఓ మల్లికార్జునరెడ్డి ఆదేశాల మేరకు చేయూతనందించామని వివరించారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాకారులు, వాకర్స్‌కు మజ్జిగ ప్యాకెట్లను ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. యజ్ఞానీ, నలుబోలు బలరామయ్యనాయుడు సౌజన్యంతో కార్యక్రమాన్ని చేపట్టామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కిలారి శ్రీనివాసులునాయుడు, నారాయణరెడ్డి తెలిపారు. డిస్ట్రిక్ట్ – 203 గవర్నర్ పెద్ది శివరామ్‌ప్రసాద్, రీజినల్ కౌన్సిలర్ వెంకటాద్రిరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, రామ్మోహన్‌రెడ్డి, సదానందరెడ్డి, ఏకొల్లు రాఘవరెడ్డి, కొండూరు సుబ్బారావు, నసీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

19న యోగా మహోత్సవం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో యోగా మహోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని నయోగో ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు యజ్ఞేష్‌సింగ్ పేర్కొన్నారు. నగరంలోని పెంచలమ్మ ఆస్పత్రిలో పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. డాక్టర్లు స్వప్న, ఉదయ్‌శంకర్, యోగా గురువులు ప్రసన్నకుమార్, కోటేశ్వరరెడ్డి, రవీంద్ర, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం



అరుణకుమారి (ఫైల్)

నెల్లూరు (లీగల్): మూలాపేటకు చెందిన మాజీ ఏపీపీ, న్యాయవాది రామిశెట్టి అరుణ కుమారి గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఆమె పార్థివదేహానికి పలువురు నివాళులర్పించారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఉమామహేశ్వర్‌రెడ్డి, సుందరయ్యయాదవ్ తదితరులు సంతాపం తెలియజేశారు.

జీఓల ఉపసంహరణకు డిమాండ్

నెల్లూరు (టౌన్): పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్లు 19, 20, 21ను ఉపసంహరించుకోవాలని రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజారహంతుల్లా శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సెక్షన్‌కు 53 మంది విద్యార్థులు ఉండాలనే నిబంధనను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లలో హెడ్‌మాస్టర్ల పోస్టులను ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

బీపీ నియంత్రణతో గుండె వ్యాధులు దూరం

నెల్లూరు(అర్బన్): బీపీని నియంత్రణలో ఉంచుకోవడం ద్వారా గుండె, ఇతర ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని మెడికవర్ వైద్యులు సూచించారు. ప్రపంచ బీపీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో జనరల్ ఫిజీషియన్ రవీంద్రరెడ్డి మాట్లాడారు. అధిక రక్తపోటుకు సంబంధించిన మంచి చికిత్సను తమ ఆస్పత్రిలో అందిస్తున్నామని వివరించారు. హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య సంకీర్తన విభావరి రేపు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో అన్నమయ్య సంకీర్తన విభావరిని ఆదివారం సాయంత్రం ఆరుకు నిర్వహించనున్నామని నిర్వాహకులు లక్ష్మీప్రసన్న, రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగీతాభిమానులు, కళాకారులు హాజరుకావాలని కోరారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం వివాహితను వేధిస్తున్న భర్త, అత్తింటివారిపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జెండావీధికి చెందిన లియాకు చెన్నైకు చెందిన పర్వేజ్‌తో వివాహమైంది. ఆ సమయంలో కట్నకానుకుల కింద రూ.ఏడు లక్షల నగదు, 25 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.మూడు లక్షల విలువజేసే గృహోపకరణాలను లియా కుటుంబసభ్యులు ఇచ్చారు. వివాహానంతరం కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం అదనపు కట్నం కోసం వేధించసాగారు. వీటిని తాళలేక పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డెర వృత్తిదారుల సంఘ మహాసభ నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘ ప్రథమ మహాసభను నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్నామని సంఘ రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అంశాలపై చర్చించనున్నామని, కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులను చేపట్టనున్న తరుణంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇరుగాళమ్మ సబ్‌స్టేషన్ పరిధిలోని రాజావారివీధి, చాముండివారితోట తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి 11 వరకు.. ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని త్యాగరాజనగర్, జ్యోతినగర్, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేత



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని ఏసీ సుబ్బారెడ్డి ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. దాతలుగా దద్దోలు వెంకయ్య జ్ఞాపకార్థం కుమారుడు రమణయ్య, కిలారి వెంకటస్వామినాయుడి జ్ఞాపకార్థం కుమారుడు వరుణ్ వ్యవహరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ – 203 గవర్నర్ పెద్ది శివరామ్‌ప్రసాద్, సీఐ జగన్‌మోహన్‌రావు, వెంకటాద్రిరెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాబోలు సత్యనారాయణ, కార్యదర్శి స్నేహ సురేష్, కనకట్ల రఘురామ్ ముదిరాజ్, వేలూరు రంగారావు దాసరి అనంతరామారావు, రమేష్ బాసం శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

5న ఏపీజీఈఏ రాష్ట్ర మహాసభ



నెల్లూరు (పొగతోట): ఏపీజీఈఏ రాష్ట్ర కౌన్సిల్ మహాసభను విజయవాడలో జూన్ ఐదున నిర్వహించనున్నారని రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నగరంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఉద్యోగులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. జిల్లా నేతలు చింగీషా, కిరణ్‌కుమార్, ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొండిబకాయిదారులపై చర్యలు



పీఏసీఎస్ సీఈఓలకు శిక్షణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో వాయిదా మీరిన మొండి బకాయిదారులపై చర్యలు చేపట్టాలని డీసీఓ గుర్రప్ప పేర్కొన్నారు. వాయిదా మీరిన బకాయిలపై చట్టపరమైన చర్యలు అనే అంశంపై జిల్లాలోని పీఏసీఎస్ సీఈఓలకు నగరంలోని డీసీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

బాలికలకు అవగాహన కల్పించండి



బాలికలతో ఐసీడీఎస్ పీడీ

నెల్లూరు (పొగతోట): బాల్య వివాహాలపై నిషేధం, హ్యూమన్ ట్రాఫికింగ్, గుడ్.. బ్యాడ్ తదితరాలపై బాలికలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ పీడీ సువర్ణ ఆదేశించారు. కిశోర బాలికల సాధికారత, మనందరి బాధ్యత అనే అంశంపై కేశవులునగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యం, అనీమియా బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీడీపీఓ లక్ష్మీదేవి, బాలల సంరక్షణాధికారి సురేష్, ఏఎస్సైలు శ్రీహరి, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలకు పన్నులు వసూలు చేయండి



ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని ఖాళీ స్థలాలను గుర్తించి, వాటి యజమానులకు నోటీసులను జారీ చేసి పన్నులను వసూలు చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరంలోని తొమ్మిదో డివిజన్లో గల నజీర్‌తోట, కుసుమ దళితవాడ, ఎఫ్సీఐ కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. కాలువల పూడికతీత.. సిల్ట్ ఎత్తివేత పనులను పరిశీలించారు. భవనాలకు కొలతలేయించి, అసెస్మెంట్, ఇంటి పన్ను డిమాండ్‌ను తనిఖీ చేశారు. నిర్మాణ కొలతలకు, ఇంటి పన్ను డిమాండ్‌కు మధ్య వ్యత్యాసం ఉండటంతో సంబంధిత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు.

- ఎన్నికల సంఘం సూచనల మేరకు నెల్లూరు నగర నియోజకవర్గంలో జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నందన్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల నమోదుపై డిగ్రీ కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే క్రమంలో ఉండేలా చూడాలని, గత ఎన్నికల్లో చట్టాల ఉల్లంఘనకు పాల్పడిన వారికి పార్టీల బూత్ ఇన్‌చార్జీలు లేదా ఇతర సిబ్బందిగా అవకాశం కల్పించకుండా చూడాలని కోరారు. అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ షఫీమాలిక్, నెల్లూరు అర్బన్ ఎన్నికల డీటీ ఆనంద్‌రావు, నగరపాలక సంస్థ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ పద్మావతి, చక్రపాణి పాల్గొన్నారు.